క్లుప్తంగా

రైతులకు కావాల్సిన వరి విత్తనాలు సిద్ధం

వెంకటాపురం(కె): వెంకటాపురం పీఏసీఎస్‌ఓ రైతులకు కావాల్సిన వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహనరావు బుధవారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఆర్‌ఎన్‌ఆర్ 15048, బీపీటీ 5204, ఎంటీయూ 1224 రకం వరి విత్తనాలు సొసైటీ కార్యాలయంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం 25 కేజీల బస్తా రూ.1,100, బీపీటీ 5204 రకం 25 కేజీ బస్తా రూ.1,170, ఎంటీయూ 1224 రకం 25 కేజీ బస్తా రూ.1,170కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పీఏసీఎస్ కార్యాయలం వద్ద సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

మంద కృష్ణ సన్మానానికి తరలిరావాలి



బెల్లంపల్లి సురేష్

కాళేశ్వరం: పద్మశ్రీ అందుకున్న అనంతరం ఈనెల 31న వరంగల్‌కు వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు వరంగల్‌లో నిర్వహించనున్న ఘనసన్మానం, ర్యాలీ కార్యక్రమాల్లో దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మహాదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన మంద కృష్ణకు నిర్వహించే సన్మానంలో మండలం నుంచి పెద్దఎత్తున దళితులు, ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవితేజ, సదానందం, సుశాంత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై కేసు నమోదు

కాటారం: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్‌పై కేసు నమోదు చేసినట్లు బుధవారం ప్రొబేషనరీ ఎస్సై గీతారాథోడ్ తెలిపారు. రాష్ట్ర మంత్రులను అవమానపర్చేలా శ్రావణ్ సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టు చేసినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆంగోతు సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై పేర్కొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన పలువురు నాయకులు



వెంకటాపురం(కె): తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేట్టిన వేణుగోపాల్‌ను వాడబలిజ సేవా సంఘం నాయకులు, మండల బీజేపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామేల్ల రాజశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొల్లె సునీల్, మండల ప్రధాన కా ర్యదర్శి నోముల శ్రీకిషన్, నాయకులు వేమ సుందర్, మట్టి రమేష్, సతీష్, వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్, రాష్ట్ర అధికార ప్ర తినిధి తోట మల్లికార్జునరావు, నాయకులు బద్ది ఆదినారాయణ, సునీల్, బోగట విజయ్ ఉన్నారు.

ఆర్థికసాయం



రేగొండ: మండల కేంద్రంలోని గడిపల్లి గ్రామానికి చెందిన కట్కూరి సరిత భర్త రెండేళ్ల క్రితం మరణించాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి గ్రామానికి చెదిన తిరుపతిరెడ్డి హైదరాబాద్‌కి చెందిన సీతారాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఆయన రూ.10 వేలు అందజేశారు. కాగా బుధవారం సరితకు గ్రామస్తులు నగదును సరితకు అందజేశారు. కార్యక్రమంలో సామల తిరుపతిరెడ్డి, ఏనుగు రవిందర్‌రెడ్డి, దొడ్ల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ శాయంపేట గ్రామ కమిటీని బుధవారం ఆ పార్టీ గ్రామ ఇన్‌చార్జ్‌లు కొమ్ముల భాస్కర్, మామిడిపల్లి సాంబయ్య, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మారేపల్లి రాజు(వరద రాజు), ఉపాధ్యక్షులుగా కోల శ్రీనివాస్, బాసాని చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా మామిడి సుదర్శన్, కార్యదర్శులుగా బేరుగు సతీశ్, బొల్లెపల్లి సదానందం, కోశాధికారిగా అల్లె శంకర్, ప్రచార కార్యదర్శిగా రాము, మహిళా అధ్యక్షురాలిగా శ్వేత, ప్రధాన కార్యదర్శిగా మారేపల్లి కల్యాణిని ఎన్నుకున్నారు.

జీఓ ఇచ్చారు.. నిధులు మరిచారు

- నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- చేసిన పనుల బిల్లుల కోసం కాంట్రాక్టర్ ఎదురుచూపు



అసంపూర్తిగా పనులు నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం

కన్నాయిగూడెం: మండలంలో దళిత సామాజికవర్గ ప్రజలు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.20 లక్షలతో భవనం నిర్మించాలని జీఓ ఇచ్చింది. కానీ నిధులతో కూడిన క్లియరెన్స్ అనుమతులను విడుదల చేయలేదు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేయాలని ఆదేశాలు రావడంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు తొందరపాటు నిర్ణయాలతో సంబంధిత కాంట్రాక్టర్లను ఒత్తిడిలకు గురిచేసి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్లు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి పిల్లర్లు వేసి స్లాబ్ వరకు పనులను పూర్తి చేశారు. పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో ఎస్సీ సామాజిక కుటుంబాల ఆశ నిరాశగానే మిగిలింది. వారి సమావేశాలు శుభాకార్యాలు, సభలు, ఇతరతర వాటిని రోడ్లపై చెట్ల కింద నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. భవన నిర్మాణం పూర్తి చేయించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించకపోవడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పనులు చేపట్టి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల ప్రొసీడింగ్ మరిచారు..

గత ప్రభుత్వం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్మాణం చేపట్టిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు జీఓ మాత్రం ఇచ్చి నిధులతో కూడిన ప్రొసీడింగ్ ఇవ్వలేదు. పంచాయతీ రాజ్ అధికారులు తొందరపాటుతో కాంట్రాక్టర్లతో పనులను మొదలు పెట్టించారు. ప్రారంభించని కాంట్రాక్టర్లు రూ.15లక్షల వరకు పనులు చేసి బిల్లులు రాకపోవడంతో వదిలేశారు. సొంతంగా అప్పులు తొచ్చి పెట్టిన కాంట్రాక్టర్లకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. బిల్లులు ఎప్పుడొస్తాయని అధికారులను నిలదీస్తే ఆ పనికి బిల్లులు రావు.. ఫైనాన్షియల్ క్లియరెన్స్ పెండింగ్‌లో ఉందని సమాధానమిస్తున్నట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

భవనం పూర్తి చేస్తే మేలు..

మండల కేంద్రంలో నిర్మాణం ప్రారంభించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేస్తే ఎస్సీ సామాజిక వర్గానికి ఎంతగానో మేలుజరుగనుంది. సభలు, సమావేశాలు, వేడుకలకు అనుకూలంగా ఉంటుంది. భవనం పూర్తి కాకపోవడంతో చెట్ల కింద, ప్రధాన రోడ్లకు పక్కనే పాత భవనాల్లో ఏర్పాటు చేసుకుంటున్నట్లు చెప్పుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



మండల కేంద్రంలో నిర్మాణం తలపెట్టిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. నిధులు రాక కాంట్రాక్టర్ పనులను మధ్యలో వదిలేశారు. భవనం పూర్తయితే దళిత సామాజిక వర్గానికి సంబంధించిన సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా ఉంటుంది.

- వాసంపెల్లి నరేందర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, గుర్రేవుల

క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు

- రాష్ట్ర మంత్రి సీతక్క



నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: యువత క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరానగర్ గ్రామంలో ఇటీవల ఇంటర్మీడియట్ ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన పెద్ది శృతి కుటుంబ సభ్యులను మంత్రి సీతక్క.. పార్టీ నాయకులతో కలిసి బుధవారం పరామర్శించారు. విద్యార్థిని శృతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తొందరపాటు నిర్ణయాలను తీసుకుని తల్లిదండ్రులకు గర్భశోకం తీసుకురావొద్దని అన్నారు. మంచి విద్య అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్, తాడ్వాయి మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం జాతర మాజీ చైర్మన్ అరెం లచ్చుపటేల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర, నాయకులు పులి రవిగౌడ్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిరిల వెంకన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ జగదీశ్, యువజన సంఘం నాయకుడు బొల్లు నాగేంద్రబాబు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌పై కూలిన చింతచెట్టు



కూలిన చింత చెట్టు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాయం వీధిలో మంగళవారం రాత్రి విద్యుత్ లైన్ పై చింత చెట్టు కూలిపడడంతో విద్యుత్ పోల్ విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా, విద్యుత్ శాఖ అధికారులు బుధవారం చింత చెట్టును తొలగించడంతోపాటు విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది ఫరీద్, పాషా తదితరులు ఉన్నారు.

జాగ్రత్తగా ఉండండి

వాజేడు: అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వాజేడు మండల విద్యుత్ ఏఈ అర్షద్ అహ్మద్ ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ వైర్లకు విద్యుత్ ప్రసారం జరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు అటువైపు వెళ్లొద్దని సూచించారు. పశువులు మేతకు వెళ్లినప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఏ గ్రామంలోనైనా విద్యుత్ వైర్లు తెగినా, స్తంభాలు విరిగి పడినా వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలి

మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

వాజేడు: రానున్న వర్షాలు, వరదలపై మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఈ మేరకు మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాలు, వరదలు వస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సన్నద్ధంగా ఉండాలన్నారు. పల్లపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యల చేపట్టడానికి కావాల్సిన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందుకెళ్లాలన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుతో రహదారులపైకి వరద నీరు చేరితే చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వర్షాలు, వరదలతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పరిహారం అందజేత

వాజేడు/కన్నాయిగూడెం: హైటెక్ బాండ్ మొక్కజొన్న పంటసాగు చేసి నష్టపోయిన రైతులకు నేడు (గురువారం) పరిహారం అందజేయనున్నట్లు వాజేడు వ్యవసాయాధికారి ముంజ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు రైతు వేదికలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మొక్కజొన్న పంట సాగు చేసి నష్టపోయిన వారందరూ తమకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్స్ తీసుకురావాలని ఆయన సూచించారు. హైటెక్ బాండ్ కంపెనీ నుంచి పరిహారం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

బిల్ట్ కార్మికులను ఆదుకోండి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ములుగు: కర్మాగారం మూతపడడంతో రోడ్డునపడ్డ బిల్ట్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని మానవ హక్కుల వేదిక సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందించారు. బకాయిలను చెల్లించే క్రమంలో యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు(జేఏసీ) కుమ్మక్కై డబ్బులు కాజేసినట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రికి వివరించారు. ఈ విషయంలో చొరవ తీసుకొని జేఏసీ నాయకులను పిలిపించి కార్మికుల సమక్షంలో నిజానిజాలను తేల్చాలని కోరారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌లు తెలిపారు. వారి వెంట బిల్ట్ కార్మికులు విజయరామారావు, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ అందజేత



ప్యూరిఫయర్ అందజేస్తున్న మేనేజర్ నవీన్

మొగుళ్లపల్లి: వెలుగు మండల సమాఖ్య కార్యాలయానికి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో బుధవారం వాటర్ ప్యూరీఫయర్ అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ నవీన్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తమ రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తూ బ్యాంకు పురోగతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. వడ్డీ లేని రుణాలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం అంబాల రవివర్మ, సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శి రమాదేవి, సునిత, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రాజశేఖర్, క్యాషియర్ రూపేష్, రవికిరణ్ సీసీలు బత్తిని శ్రీనివాస్, బత్తిని ప్రవీణ్, మండల సమాఖ్య సిబ్బంది, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ అండ



నివాళులర్పిస్తున్న సూర్య, నాయకులు, తదితరులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కుంజ సూర్య అన్నారు. మండలంలోని బయ్యక్కపేటలో గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంది మనోహర్ పెద్దకర్మకు బుధవారం హాజరై కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అదే గ్రామానికి చెందిన చందా లవకుకు రూ.52వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మేడారం జాతర మాజీ చైర్మన్ లచ్చుపటేల్, తాడ్వాయి సర్పంచ్ ఇర్ప సునీల్, నాయకులు మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్‌హుస్సేన్, నాయకులు సంపత్, గోవర్ధన్, సరేందర్‌రెడ్డి, ఎలకంటి రాములు, చందా నవీన్ పాల్గొన్నారు.

ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- యూట్యూబర్‌పై కేసు నమోదు చేయాలని ముస్లిం సంఘాల ఫిర్యాదు



ఎస్సై తాజొద్దీన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ముస్లింలు, నాయకులు

ఏటూరునాగారం: మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని, అనుచిత వ్యాఖ్యలను చేసిన చిలుక ప్రవీణ్‌పై కేసు నమోదు చేయాలని ముస్లిం సంఘం నాయకులు బుధవారం మండల కేంద్రంలోని ఎస్సై తాజొద్దీన్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జమామజీద్ హాఫీజ్ రెహమాన్ సిరాజ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్‌కు చెందిన చిలుక ప్రవీణ్ యూ న్యూస్ పేరుతో యూ ట్యూబ్ చానల్ నిర్వహిస్తూ మత విద్వేషాన్ని రెచ్చగొట్టేలా ముస్లిం సమాజాన్ని అవమానపరిచేలా ఇస్లాం చివరి ప్రవక్త మహమ్మద్ (సల్లలాహు అలైహి వసల్లం) గురించి అశాస్త్రీయంగా మాట్లాడం సరికాదన్నారు. ప్రవక్త 14 పెళ్లిల్లు చేసుకున్నారని చెబుతూ సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా అనాలోచితంగా వ్యాఖ్యలు చేశాడని తెలిపారు. ప్రవక్త మహ్మమద్ 90 ఏళ్ల వయస్సులో 25 ఏళ్ల యువతిని పెళ్లి చేసుకున్నారని అసత్య ప్రచారం చేస్తున్నాడని అన్నారు. ఇది పూర్తి తప్పుడు సమాచారమని తెలిపారు. ప్రవక్త మహ్మద్ 63 ఏళ్ల వయస్సులోనే మృతిచెందినట్లు స్పష్టం చేశారు. ప్రవీణ్ వ్యాఖ్యలు అతని చర్యలు కేవలం ముస్లింలనే కాకుండా దేశంలోని మత సామరస్యాన్ని పూర్తిగా భంగపరచేలా ఉన్నాయని అన్నారు. అతడిపై కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో అయూబ్, గౌస్, ఖలీల్, రియాజ్ ఖాన్ అజ్మత్, అబ్బు సాహబ్ ,ఆరిఫ్, ఖాజా ఇమామ్, రిజ్వాన్, అజర్, అబ్రార్, ఇలియాస్, అకీల్, మునీర్, యాఖూబ్ పాషా, పాల్గొన్నారు.

టీజేఎఫ్ సభను విజయవంతం చేయాలి

- యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, జర్నలిస్టులు

భూపాలపల్లి రూరల్: తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవాలను జయప్రదం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏ143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ కోరారు. తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఆవిర్భవించి మే 31వ తేదీతో 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహిస్తున్న సభ వాల్‌పోస్టర్‌ను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31న టీజేఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తుందని తెలిపారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు నినాదంతో 2001 మే 31న ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు అన్ని వర్గాల ప్రజలు, ఉద్యమ సంఘాలను సంఘటితం చేసినందన్నారు. లెనిన్ మాట్లాడుతూ.. జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సంబరాలకు జిల్లా నుంచి జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగన్, అడ్డగట్ల శ్రీధర్, బండారి రాజు, శేఖర్ నాని, తిక్క ప్రవీణ్, జాలిగం రాజు, ఇమ్రాన్, శ్రీనివాస్, రాజ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- రేగొండలో బోరు మోటారు ప్రారంభం



బోరు మోటారును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రేగొండ: గామాల్లో నీటిఎద్దడి నివారణకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రజలకు మంచి నీటి వసతి కోసం రూ.4 లక్షలతో వేసిన రెండు బోరు మోటార్లను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దామరంచపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు మొట్టే కిరణ్ పటేల్ జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సౌజన్య, కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు సంపత్‌రావు, సూదనబోయిన ఓంప్రకాశ్, పున్నం రవి, వీరబ్రహ్మం, మల్లారెడ్డి, బొజ్జం రవి, పట్టెం శంకర్, కొలెపాక సాంబయ్య, ముద్దమల్ల రవి పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి సీతక్క



చెక్కులు అందజేస్తున్న నాయకులు

- మంత్రి సీతక్క
- ములుగులో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ములుగు: ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ఓ భరోసా అని మంత్రి సీతక్క అన్నారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క రూ.24.53లక్షల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరపున బిల్లులో 70 శాతం వరకు చెక్కుల రూపేణ అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జయపాల్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు వంగ రవియాదవ్, జిల్లా అధికార ప్రతినిధులు కుమార్‌గౌడ్, అహ్మద్‌పాషా, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వాజేడు: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం సొసైటీ అధ్యక్షుడు ఎగ్గడి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల పూడి విక్రాంత్ లబ్ధిదారులకు అందించారు. మండల పరిధిలోని పూసూరు, పెద్ద గంగారం, అరుణాచల పురం, వాజేడు గ్రామాలకు చెందిన తొడెం కొండలరావు, కొప్పనాతి సుధాకర్, ఆలం హామిత, నల్లెబోయిన రాజేశ్వరరావుకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. అనారోగ్యంతో బాధ పడుతున్నవారు దరఖాస్తు చేసుకుంటే సీఎం రిలీఫ్ ఫండ్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దంతులూరి విశ్వనాథప్రసాదరాజు, సొసైటీ ఉపాధ్యక్షుడు వత్సవాయి జగన్నాథరాజు, తల్లడి ఆదినారాయణ, రాణిమేకల రాంబాబు, కాజావలి, సంజీవ, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, భీమయ్య తదితరులున్నారు.

నిబంధనలు పాటించాలి



షాప్‌లో తనిఖీ చేస్తున్న ఏఓ

టేకుమట్ల: ఫర్టిలైజర్ డీలర్లు, నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కల్యాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, స్టాకు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడతూ.. ఫర్టిలైజర్ షాపుల్లో రైతులు కొనుగోలు చేసిన సరుకులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అలాగే స్టాక్ రిజిస్టర్లు తప్పనిసరిగా చూపించాలని, ధరల పట్టిక సైతం రైతులకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం విత్తన కొనుగోళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట ఏఈఓలు రాహుల్, అరుణ్, భరత్ ఉన్నారు.